క్లుప్తంగా

రేపు బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని ఆ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఆర్. నర్సింహ కోరారు. ఉదయం 10 గంటలకు రాయల్ ఫంక్షన్‌హాల్లో జరిగే సమావేశానికి ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ పి.మహేందర్‌రెడ్డి, పార్టీ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ ఎల్. రమణ, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



హర్షిత్‌రెడ్డిని అభినందిస్తున్న ప్రియామనీష్

రాజేంద్రనగర్: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో పాలు పంచుకున్నప్పుడే విజ్ఞానవంతులుగా ఎదుగుతారని అత్తాపూర్ రవీంద్ర భారతీ పాఠశాల డీన్ ప్రియామనీష్, ప్రిన్సిపల్ సుధా వెల్లడించారు. సి.వి.రామానుజం కాంపిటేటివ్ యంగ్ జీనియస్ ఎగ్జామ్‌లో అత్తాపూర్ రవీంద్రభారతీ పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థి వర్షిత్‌రెడ్డి డిస్ట్రిక్- 2వ ర్యాంక్‌ను సాధించడంతో పాఠశాలలో అభినందించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు పోటీ పరీక్షలు ఎంతగానో దోహదపడుతాయన్నారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న వెంకటేశ్‌యాదవ్

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో అవసరమైన ప్రతి చోట సీసీ రోడ్ల నిర్మాణం చేస్తున్నామని వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్ అన్నారు. శనివారం ఆయన మున్సిపాలిటీ కేంద్రంలోని 7, 16 వార్డులలో రూ. 25 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశల వారీగా నిధులను కేటాయిస్తూ ప్రజలకు మెరుగైన వసతులు కల్పిస్తున్నామన్నారు.

హెచ్‌సీయూ విద్యార్థినికి ఆహ్వానం


మృణంద భట్టాచార్య

రాయదుర్గం: జర్మనీలో 72వ లిండావ్ నోబెల్ గ్రహీత సమావేశానికి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థినికి ఆహ్వానమందింది. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సిస్టమ్స్ అండ్ కంప్యూటేషనల్ బయాలజీ చివరి సంవత్సరం ఐఎంఎస్‌సీ విద్యార్థి మృణంద భట్టాచార్యకు ఫిజియాలజీ, మెడిసిన్ రంగంపై నిర్వహించనున్న సదస్సుకు ఆహ్వానించారు. నోబెల్ గ్రహీతలు, సైన్స్ మార్గదర్శకులతో సంభాషించడానికి యువ పరిశోధకులకు ఇది ఒక గొప్ప అవకాశం.

హెచ్‌సీయూ వైట్‌రాక్స్‌లో 'క్లీనప్ డ్రైవ్'



రాయదుర్గం: గచ్చిబౌలి సెంట్రల్ యూనివర్సిటీలోని 'వైట్‌రాక్స్' ప్రాంతంలో శనివారం స్టూడెంట్స్ ఫర్ సేవ' సంస్థ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు చెత్త చెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ హెచ్‌సీయూ అధ్యక్షురాలు నమ్రతాసింగ్, నిర్వాహకులు తులసీరామ్, సంగమేష్, స్నేహ మాట్లాడుతూ సెలవు రోజుల్లో క్యాంపస్‌లో విద్యార్థులు ఎక్కువగా సేద తీరే ప్రాంతాలను ఎంపిక చేసి కార్యక్రమాలను చేపడతామన్నారు.

'జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహిస్తాం'

జియాగూడ: జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని మహాత్మా జ్యోతిరావు పూలే రాష్ట్ర యువజన సంఘం కో ఆర్డినేటర్‌గా నియమితులైన నరేష్ గోగికర్ అన్నారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర ప్రభుత్వంచే ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో జరుగనున్న మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలకు గాను కో ఆర్డినేటర్‌గా నియామకపత్రాన్ని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ చేతుల మీదుగా అందుకున్నారు. అనంతరం నరేష్ గోగికర్ మాట్లాడుతూ.. బీసీల అభ్యున్నతికి అన్నివిధాల కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా బిక్కం వెంకటేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.


ఉందానగర్ (శంషాబాద్) రైల్వేస్టేషన్ నుంచి లింగంపల్లికి బయలుదేరిన ఎంఎంటీఎస్

నెరవేరిన 12 ఏళ్ల కల!

- శంషాబాద్ నుంచి ఎంఎంటీఎస్
- ప్రధాని ప్రారంభించడంతో బయలుదేరిన రైలు


రైలులో ప్రయాణిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

శంషాబాద్: పన్నెండేళ్లుగా ప్రయాణికులు ఎదురు చూస్తున్న కల ఎట్టకేలకు నెరవేరింది. ఫలక్‌నుమా వరకు మాత్రమే పరిమితమైన ఎంఎంటీఎస్ రైళ్లు మొత్తానికి ఉందానగర్ (శంషాబాద్) వరకు రాకపోకలు ప్రారంభమయ్యాయి. భారత ప్రధాని నరేంద్రమోదీ పరేడ్ మైదానంలో రిమోట్‌తో ఎంఎంటీఎస్ రైళ్లను ప్రారంభించిన వెంటనే ఉందానగర్ (శంషాబాద్) రైల్వేస్టేషన్ నుంచి తొలిసారిగా ఉందానగర్-లింగంపల్లి ఎంఎంటీఎస్ రైలు ఉదయం 12.50 గంటలకు ఇక్కడి నుంచి బయలుదేరింది. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్ చైర్మన్ బండిగోపాల్, జెడ్పీటీసీ తన్వీ, నారింగి మార్కెట్ కమిటీ చైర్మన్ డి. వెంకటేష్‌గౌడ్, నాయకులు ఆర్. గణేష్‌గుప్తా, కౌన్సిలర్లు శ్రీకాంత్‌యాదవ్, అజయ్, నాయకులు నీరటిరాజు, కొనమొళ్ల శ్రీనివాస్, మురళి పాల్గొన్నారు.

అధికారులకు వినతి..

ఎంఎంటీఎస్ రైళ్ల రాకపోకల కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు ఉందానగర్ నుంచి బుద్వేల్ రైల్వేస్టేషన్ వరకు అందులోనే ప్రయాణించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను పరిష్కరించాల్సిందిగా రైల్వే ఉన్నతాధికారులను కోరారు. రైల్వేస్టేషన్ రాకపోకలు సాగించే దారిని బాగుచేయడంతో పాటు సిద్ధప్ప రోడ్డు, మార్కెట్ వైపు ఉన్న రహదారులను కూడా ముప్పై ఫీట్ల మేరకు పెంచాల్సిన అవసరముందన్నారు. లింగంపల్లి నుంచి ఫలక్‌నుమా వరకు కొనసాగుతున్న ఎంఎంటీఎస్ సర్వీసుల్లో ప్రస్తుతం ఇరవై సరీస్సులు ఉందానగర్ వరకు రాకపోకలు సాగించనున్నాయి. ఉదయం 5 గంటలకు మొదలుకొని రాత్రి 10గంటల మధ్యన ఈ సర్వీసులు వివిధ సమయాల్లో అందుబాటులో ఉంటాయని అధికారులు వెల్లడించారు.

మోదీకి తెలంగాణలో అడుగుపెట్టే నైతిక హక్కు లేదు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



నిరసన ర్యాలీలో పాల్గొన్న కూనంనేని సాంబశివరావు

శంషాబాద్: అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్రాన్ని ఇబ్బందుల పాల్జేస్తున్న భారత ప్రధాని నరేంద్రమోదీకి రాష్ట్రంలో అడుగుపెట్టే నైతిక హక్కులేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. తెలంగాణ అభివృద్ధికి పైసా విడుదల చేయని ఆయనే ఇక్కడ సభలను పెట్టడం సరైంది కాదన్నారు. భారత ప్రధాని నరేంద్రమోదీ నగరానికి రాక సందర్భంగా సీపీఐ ఆధ్వర్యంలో శనివారం శంషాబాద్ పట్టణంలో నిరసన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. విభజన చట్టంలో ఉన్న హామీల్లో ఏ ఒక్క దానిని కూడా కేంద్ర ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. రాష్ట్రానికి ఇస్తామన్న బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, రైల్వేకోచ్ ఫ్యాక్టరీలు ఎక్కడున్నాయని ప్రశ్నించారు. ప్రభుత్వ రంగ వ్యవస్థలను ప్రైవేటీకరణ చేయడమే లక్ష్యంగా కేంద్ర సర్కారు పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలోని కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయహోదా ఇవ్వక పోగా.. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులు ముందుకు సాగకుండా ఇరురాష్ట్రాల మధ్యన తగాదాలను కేంద్ర సర్కారు రాజేస్తోందన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలా..?

మతపరమైన రాజకీయాలు చేసే బీజేపీ మరింత దిగజారి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడేలా పదోతరగతి పేపర్ల లీకేజీకి కూడా కారణంగా మారడం దారుణమన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పేపర్ లీకేజీలో అడ్డంగా దొరికిపోయారని వెంటనే అతనికి కఠిన శిక్షపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్ర, నాయకులు నర్సింగ్‌రావు, పర్వతాలు, అఫ్సర్ పాల్గొన్నారు.

వరకట్న వేధింపులకు గృహిణి బలి

రాజేంద్రనగర్: అదనపు కట్నం కోసం తమ కూతురును వేధించి హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారంటూ కర్ణాటకకు చెందిన దంపతులు అత్తాపూర్ ఔట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ కూతురును చంపడంతో పాటు కేసును వాపసు తీసుకోవాలని బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ వివరాల ప్రకారం.. అత్తాపూర్‌కు చెందిన రత్నదీప్(28) వివాహం కర్ణాటక బీదర్‌కు చెందిన నందిని(24)తో రెండేళ్ల క్రితం జరిగింది. వివాహ సమయంలో 8 తులాల బంగారం, ఐదు లక్షల కట్నం ఇచ్చి ఘనంగా పెళ్లి జరిపించారు. వివాహం జరిగిన కొన్నిరోజులకే రత్నదీప్ అదనపు కట్నం కోసం భార్యను వేధించేవాడు. గత నెల రోజులుగా కొత్తగా ప్లాట్ కొనుగోలు చేస్తున్నామని డబ్బులు తీసుకురావాలంటూ రత్నదీప్‌తో పాటు అత్తా మామా విజయ, లక్ష్మణ్‌రావులు సైతం వేధించారు. ఈ నెల 6వ తేదీన రత్నదీప్ బీదర్‌లోని నందిని తల్లిదండ్రులకు ఫోన్‌చేసి నందిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందంటూ సమాచారం అందించారు. హుటాహుటిన తల్లిదండ్రులు నగరానికి చేరుకున్నారు. 7వ తేదీ ఉస్మానియా మార్చురీలో మృతదేహాన్ని పరిశీలించగా ఒంటిపై గాయాలు ఉండడంతో అదనపు కట్నం కోసమే అత్తింటి వారు వేధించి హత్య చేశారని నిర్ధారించుకుని దహన సంస్కారాలు పూర్తి చేశారు. శనివారం ఉదయం అత్తాపూర్ ఔట్‌పోస్టు పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా కేసును నమోదు చేస్తామన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ ప్రింట్ మీడియా వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ టీయూడబ్ల్యూయూజే(ఐజేయూ) సమావేశం శనివారం మైలార్‌దేవ్‌పల్లిలోని దుర్గా కన్వెన్షన్‌లో జరిగింది. సమావేశంలో వివిధ అంశాలపై చర్చించిన అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. రంగారెడ్డి జిల్లా దాడుల నివారణ కమిటీ సభ్యులు భీమయ్య, సభ్యులు ఏ.పి.చారి, సూర్యకిరణ్, బాబురావు, పాపిరెడ్డిల పర్యవేక్షణలో ఏకగ్రీవంగా తీర్మానించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా వి.చందు, షేక్ నిజాముద్దీన్, జాయింట్ సెక్రటరీలుగా కె.మహేష్, టి.లక్ష్మణ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం.ప్రేమ్‌రాజ్, స్పోర్ట్స్ సెక్రటరీగా గడ్డె యాదగిరి, పబ్లిసిటి సెక్రటరీగా కె.చంద్రకాంత్, కోశాధికారిగా ఎస్.విజయ్‌కుమార్, సహాయ కోశాధికారిగా డి.ఇంద్రసేన, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా గోంగూర శ్రీనివాస్, సలహాదారులుగా డి.పాపిరెడ్డి, పి.సూర్యకిరణ్, బి.బాబురావు నియమితులైయ్యారు.


ర్యాలీలో పాల్గొన్న యువకులు

ఉత్సాహంగా రన్‌ఫర్ జీసస్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్‌లో శనివారం బుద్వేల్ యునైట్ చర్చిల ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ నిర్వహించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు డాక్టర్ కె.నతానియల్ ప్రార్థనలు చేసి రన్ ఫర్ జీసస్‌ను ప్రారంభించారు. బుద్వేల్ బాబు జగ్జీవన్‌రామ్ చౌరస్తా నుంచి ఎన్ఐపీహెచ్ఎం, పీడీపీ చౌరస్తా, ఉప్పర్‌పల్లి, హైదర్‌గూడ, అత్తాపూర్ మీదుగా అబిడ్స్‌కు చేరుకుంది. దారి పొడువునా పాటలు రన్ ఫర్ జీసస్ అంటూ నినాదాలు చేశారు. యేసు లేచాడు అంటూ పాటలు పాడుతూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చందు, న్యాయవాది వరప్రసాద్, బండ్లగూడెం ప్రసాద్, జాగృతి రాజేంద్రనగర్ నియోజకవర్గ కన్వీనర్ రగడంపల్లి శ్రావణ్, జేమ్స్, అప్పారెడ్డిగూడెం మహేందర్, మినుముల గంగాధర్, కోరని అనిల్ పాల్గొన్నారు.

'దేశ సంపదనంతా ప్రైవేట్‌కి అప్పగిస్తున్నారు'


నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

రాజేంద్రనగర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ భారతదేశ సంపదనంతా ప్రైవేట్‌కి అప్పజెప్పుతున్నారని రాజేంద్రనగర్ మండల సీపీఎం పార్టీ కార్యదర్శి జి.ఎం.కురుమయ్య అన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రధాని మోదీ రాకను నిరసిస్తు కాటేదాన్‌లో శనివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో ఉన్న సింగరేణి ప్రైవేటుకు అప్పగించడం దుర్మార్గం అన్నారు. విభజన హామీలను అమలు చేయకపోవడం తెలంగాణకు బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. విమాన రంగ ఆస్తులు, ఎల్ఐసీ, బ్యాంకింగ్ రంగాన్ని, భారత దేశానికి రక్షణ రంగాన్ని కూడా ప్రైవేటు వారికి అప్పజెప్పడం ఏంటని ప్రశ్నించారు. ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రధానమంత్రి ఒక్క ఉద్యోగం ఇవ్వక ఉన్న ఉద్యోగాలను ఊడదీస్తున్నారని ఆరోపించారు. మధ్య తరగతిపై అనేక పన్నుల భారాలు, జీఎస్‌టీ పేరు మీద వంట గ్యాస్, పెట్రోల్ తదితర ధరలు పెంచి పేదల నడ్డీ విరుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.బాలస్వామి, శంకర, శ్రీ, మధు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పఠనం


హనుమాన్ చాలీసా పఠిస్తున్న భక్తులు

రాజేంద్రనగర్: ఉప్పర్‌పల్లి చైతన్య విల్లాస్ కాలనీ రామాలయంలో హనుమాన్ చాలీసా పఠనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెలంగాణ మాతృశ్రీ బాల సంస్కార కేంద్రం ఆధ్వర్యంలో 45 రోజుల పాటు హనుమాన్ చాలిసా పఠన కార్యక్రమాన్ని నిర్వహించారు. రామాలయంలో విగ్రహ ప్రతిష్టాపనలో ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగేలా నిర్వహిస్తున్న నిర్వహకులు తెలిపారు. శనివారం సాయంత్రం దేవాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వనితారెడ్డి, పద్మశ్రీ, కనకదుర్గా, సుభాష్, వెంకటలక్ష్మి, మంజుల, సునంద తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై పడ్డ వారిని తప్పించబోయి సడెన్ బ్రేక్

- ఒకదానికొకటి మూడు కార్లు ఢీ
- పలువురికి గాయాలు



రాజేంద్రనగర్: బైక్ పై నుంచి కిందపడ్డ వారిని తప్పించబోయి కారును సడన్ బ్రేక్ వేయడంతో వెనక వస్తున్న మూడు కార్లు ఒకదానికి ఒకటి ఢీకొని ఐదుగురికి గాయాలైన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శనివారం సాయంత్రం వ్యవసాయ వర్సిటీ ప్రధాన రహదారిపై ఓ ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇరువురిని ఓ కారు ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు రోడ్డుపై పడ్డారు. వారి వెనకాలే వస్తున్న మరో కారు కిందపడ్డ వారిని చూసి ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో దాని వెనకాల వసుత్ను మరో మూడు కారు ఢీకొట్టుకున్నాయి. ఈ సంఘటనలో పలు కార్లు ధ్వంసం కాగా వాటిలో ఉన్న ఐదుగురికి గాయాలయ్యాయి.

క్రమశిక్షణకు మారుపేరు మజ్లిస్ పార్టీ: ఎమ్మెల్యే కౌసర్


ఖాదర్‌బాగ్ వాసులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ క్రమశిక్షణకు మారుపేరుగల పార్టీ అని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శనివారం నానల్‌నగర్ డివిజన్‌కు చెందిన పలువురు సీనియర్ సిటిజెన్స్ ఆయనను కలిశారు. ఖాదర్‌బాగ్‌లో కొత్త డ్రైనేజీ లైన్లు రోడ్లు వేసినందుకు ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్లు మజ్లిస్ యువ కార్యకర్తలకు మార్గనిర్దేశనం వహిస్తూ వారు మరింత క్రమశిక్షణతో పార్టీ కోసం పని చేసేలా తయారు చేయాలని సూచించారు. మజ్లిస్‌లో యువ కార్యకర్తలకు పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఎన్నో బాధ్యతలు అప్పజెప్పారని ఆయన అన్నారు. వారిలోని లోపాలను గుర్తించి సీనియర్ సిటిజెన్స్ వారికి సరైన దిశానిర్దేశనం చేయాలని ఆయన సూచించారు. మజ్లిస్ ఏరియా కమిటీలకు ప్రాతినిధ్యం వహించిన వారిలో ఎందరో నేడు మజ్లిస్ ముఖ్య నేతలుగా ఎదిగారని, మరికొందరు ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యారని ఆయన అన్నారు.


వంతెన కోసం సర్వే చేస్తున్న అధికారులు

వంతెన పనుల పరిశీలన

శంషాబాద్ రూరల్: మండలంలోని పిల్లోనిగూడ-మక్తగూడ వద్ద ఎంటేరువాగుపై చేపట్టిన వంతెన పనులను శనివారం పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు పరిశీలించారు. ఇక్కడ చేపట్టిన నిర్మాణ పనులు గత కొన్ని నెలలుగా నిలిచిపోయాయి. ఇదిలా ఉండగా.. సుల్తాన్‌పల్లి-కే బీ.దొడ్డి గ్రామాల మధ్యలో ఎంటేరువాగుపై ఉన్న కల్వర్టు శిథిలావస్థకు చేరడంతో కొత్త వంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరు అయ్యాయి. ఈ పనుల కోసం అధికారులు సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సంగీతసిద్దేశ్వర్, వార్డు సభ్యులు చంద్రశేఖర్, స్థానికులు విక్రమ్, రాజు, రాఘవేందర్, కుమార్, అనిల్, నర్సింహా, జుర్కి రమేష్ పాల్గొన్నారు.

మోదీ సభకు తరలిన బీజేపీ శ్రేణులు


బస్సులో వెళ్తున్న నాయకులు


మోదీ సభకు వెళ్తున్న బీజేపీ నాయకులు


కార్పొరేటర్ సంగీతగౌరీశంకర్‌తో ఆధ్వర్యంలో..

శంషాబాద్: నగరంలోని పరేడ్ మైదానంలో జరిగిన భారత ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగసభకు బీజేపీ నాయకులు భారీగా తరలివెళ్లారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్ గుప్తా, కౌన్సిలర్ ప్రవీణ్‌కుమార్‌గౌడ్, ఎస్సీసెల్ రాష్ట్ర నాయకులు కొప్పుల ప్రశాంత్, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీధర్ బస్సుల్లో తరలివెళ్లారు.

బండ్లగూడ జాగీరు నుంచి..

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ప్రధాని బహిరంగ సభకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున శనివారం భారీ ర్యాలీగా తరలివెళ్లారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన సభకు బండ్లగూడ చౌరస్తాలో నాయకులు, కార్యకర్తలు సమావేశమై బస్సుల్లో సభా స్థలానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో శేఖర్‌ముదిరాజ్, మహేష్‌యాదవ్, కార్పొరేటర్లు భూపాల్‌గౌడ్, ప్రశాంత్‌నాయక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంజన్‌కుమార్, మహాలింగంగౌడ్, మల్లారెడ్డి, నరేష్‌యాదవ్ తరలివెళ్లారు.

మణికొండ, నార్సింగి నుంచి..

మణికొండ: సికింద్రాబాద్‌లో శనివారం జరిగిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ సభకు మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల నుంచి బీజేపీ నాయకులు తరలివెళ్లారు. బీజేపీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు సి.బీరప్ప, నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు సీహెచ్ భిక్షపతియాదవ్‌ల ఆధ్వర్యంలో బస్సులు, కార్లలో వెళ్లారు.


బండ్లగూడ నుంచి తరలివెళ్తున్న నాయకులు

రాజేంద్రనగర్ సర్కిల్ నుంచి..

రాజేంద్రనగర్: ప్రధాని మోదీ బహిరంగ సభకు రాజేంద్రనగర్ సర్కిల్ నుంచి బీజేపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు శనివారం పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఉదయం అత్తాపూర్, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రీపురం, సులేమాన్‌నగర్ డివిజన్‌ల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలంతా ర్యాలీగా హైదర్‌గూడ ప్రాంతానికి చేరుకున్నారు. అనంతరం భారీ ర్యాలీగా తరలివెళ్లారు.